# ఊరు ఊరుకొంది

"ఆరుద్ర"

మంచిగాలి వీస్తున్నాది. మనుష్యులు నిద్రలేస్తున్నారు. మనుష్యు లెప్పటికైనా నిద్రలేస్తారా అని కాచుకొని కూర్చున్న యువకుడు కళ్లు పెద్దవిచేశాడు. చూశాడు. వీస్తున్న గాలికి అతడి దుస్తులు రెపరెపలాడాయి. అతడు ఎదురుచూసే ఆ ముహూర్తాలు ఆగమించాయి. ఆగమించినవి ఆగకూడదని అతడి ఆకాంక్ష.

మనుష్యులు నడుస్తున్నారు. రోడ్లు నిద్ర లేస్తున్నాయి. నిన్న మాపటివేళ ఆవలించి కళ్లుమూసుకొన్న ఆఫీసులు అప్పుడే లేచి ఒళ్లు విరుచుకొంటున్నాయి. పోసెత్తిన రద్దీ కాలిబాటలమీద రాటు తేరుకున్నది. నింపాదిగా ఉన్న తారురోడ్డు జోరునికూడ పలుకు్కరిటున్నాది. సంచారం సంకలనం ప్రాక్టీసు చేస్తున్నాది. యువకుడు, మన కథానాయకుడు, రోడ్డు పట్టేడు.

అతగాడి బతుకు అంతకుముందే రోడ్డపాలైంది. అందుకు అతడు సానుభూతికొరకు వెతకడు. విపులమైన నెన్నుదురు-కనులలో క్రొంబెదురు కణుకు గొంతుక అతడి సంతకం. ఇవన్నీ అతడి ఆనవాళ్లు. అయితే వీటికి కొద్దికాలంకింపట కాలదోషం పట్టాయి.

మునిసిపల్ చెత్తల డబ్బాదగ్గర యువకుడు నిలబడ్డాడు. అందరూ చూస్తూ ఉండగా అతడు తాను తొడుక్కొన్న విరాళని విప్పేశాడు. దాని జేబుల్లోఉన్న ఆశాలేశాలని అందరి సమక్షంలో సురక్షితంగా భద్రపరచాడు. అవి ఒకటి ఆశా, రెండూ ఆశయం. ఈ రెంటినీ రొంటిని దోపుకొని నిశ్శబ్దంగా నిష్క్రమించాడు. గుమికూడిన జనులు చప్పట్లు కొట్టడం మరిచిపోయ్యారు. ఎవరేనా చెప్తేనేగాని జనం ఏదీ చెయ్యరు.

యువకుడు వంతెనమీదుగా వెళుతున్నాడు. వంతెనమీద జనప్రవాహం. వంతెనకింద జలప్రవాహం. యువకుడు రాకపోకలు ఆపేశాడు. వంతెనకి సాష్టాంగపడి ప్రాణదానం చేసినందుకు ప్రణామం ఆచరించాడు. లేచాడు. అందరివైపూ తిరిగి "నన్నుచూసి నవ్వండి" అన్నాడు. జనం నవ్వారు. యువకుడు సాగిపోయ్యాడు.

దేవాలయం వచ్చింది. అవును దేవాలయమే వచ్చింది. యువకుడు దానిదగ్గరకు వెళ్లలేదు. మానవుడు మేలుకొన్నప్పుడే దేముడు గాభరాపడతాడు. యువకుడు దేవాలయంతో దెబ్బలాట పెట్టుకొన్నాడు. ప్రసాదంకంచం లంచంగా అతడిముందు కొచ్చింది. అతడు దానిని స్వీకరించలేదు (అన్నట్టు అతడు అరవైరెండు గంటలనించీ అన్నం ముట్టలేదు.)

మంచిగాలి వీచడం మానేసింది. మనుష్యులు కంపుకొడుతున్నారు. రాకపోకలు రాజసం ప్రదర్శించుతున్నాయి. యువకుడి మీద ఎండెక్కింది. దాన్ని మోసుకొంటూ అతడు ఒక ఆఫీసుముందుకు వెళ్ళి ఆగాడు. అయినా ఎండ అతడి వీపు దిగనంది.

అది జననమరణాల రిజిస్ట్రారుగారి కచేరి. ఉద్యోగిగారు ఊపుకొంటూ వచ్చారు. యువకుడు వారిని సగౌరవంగా ఆపి చిన్న విషయం ఉందని మనవి చేసుకొన్నాడు. గంటకొట్టి బంట్రోతుచేత లోపలకు పిలిపించుతాను అప్పుడు చెప్పకో అన్నాడు ఆయన. అల్లాగే అని యువకుడు అక్కడే పడిగాపులు పడ్డాడు. వీపుమీది ఎండ నెత్తి కెక్కింది.

చొక్కాలేని యువకుడిని కచేరీలోకి ఎలా పిలిపించడం అని ఉద్యోగిగారు కొంచెం ఆలోచించారు. నిరాశో, నిర్వేదమో, ఆత్రుతో, ఆందోళనో ఏదో ఒకటి ఉడుపులుగా కట్టుకొంటేనేగాని ఉద్యోగి ముందుకు వెళ్ళడం ఉచితంకాదు. అయినా యువకుడి కళ్లలో ఉద్వేగం ఉంది కాబట్టి ఉద్యోగి లోనికి పిలిపించాడు.

"ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"ఒక జననం రిపోర్టు చెయ్యాలి" అన్నాడు యువకుడు ఉత్కంఠతో.

"ఎవరికి పుడత?"

"నాకే!"

"ఎప్పుడు?"

"అరవై గంటల కిందట"

"అంటే?"

"మొన్న"

"ఇన్నాళ్లనుంచీ ఎందుకు రిపోర్టుచెయ్యలేదు"

"పుట్టింది, చస్తే రెండూ ఒకసారే రిపోర్టు ఇద్దామనుకొన్నా"

"సరే వివరాలు చెప్పు. నీ పేరు"

చెప్పాడు.

"నీ భార్య పేరు?"

"నాకు పెళ్ళికాలేదు"

ఉద్యోగి ఉరిమిచూశాడు. ఒంటి కాలిమీద కుంటుతున్న ధర్మం ఓపిక లేక పడిపోవడానికిగల కారణం యువకుడి మొఖం మీద ఆ ఉద్యోగిగారికి కనబడింది.

"సరే—దాని పేరు?"

"దేని పేరు?"

"నీ భార్య-కాదు-ఆ స్త్రీ పేరు"

"స్త్రీ ఎవరూ లేదు"

తండ్రెవరో తెలియకుండా బిడ్డలు పుట్టవచ్చుగాని తల్లే లేకుండా సంతానప్రాప్తేమిటని ఉద్యోగి విస్తుపోయాడు. "ఆడది లేకుండా పిల్లలెలా పుడతారయ్యా" అన్నాడు.

"నాకు పిల్లలు పుట్టలేదు"

"మరెందుకు ఇక్కడకి వచ్చావు"

"జననం రిపోర్టు చెయ్యడానికి"

"ఏ జననం"

"నాకు మానవత్వంమీద నమ్మకం కలిగింది. జీవితంమీద ఆశ జనించింది. ఆ విషయం రాసుకోండి" అన్నాడు యువకుడు.

తండ్రయినవాడిమీద తలకు మించిన భారం ఉండడం భావ్యం కాబట్టి ఉద్యోగిగారు యథాప్రకారంగా యువకుడి నెత్తి మీదికి ఎంషని ఎక్కించారు.

ఊరు ఊరుకొంది.

★


**కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో**

రెండు భాగములు

ఒక్కొక్క భాగం

**వెల రూ. 3-8-0**

పోస్టుఖర్చు ప్రత్యేకం.

**ఆంధ్ర గ్రంథమాల,**

మద్రాసు-1